క్లుప్తంగా

18 కేజీల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

బీచ్ రోడ్డు: అక్రమంగా రవాణా చేస్తున్న 18 కేజీల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. కంచరపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని జ్ఞానాపురం రైల్వేస్టేషన్ కార్ పార్కింగ్ వద్ద గంజాయి రవాణా జరుగుతుందని అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ బృందం తనిఖీలు చేపట్టింది. ముగ్గురు వ్యక్తుల నుంచి 18 కేజీల గంజాయితో పాటు మూడు మొబైల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కంచరపాలెం పోలీసు స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూత్రనాళ వ్యాధులపై అవగాహన



డాక్టర్ జయంతి అనంతకృష్ణను సత్కరిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అణుభౌతిక శాస్త్ర విభాగంలో సోమవారం ప్రత్యేక అతిథి ప్రసంగం నిర్వహించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ జయంతి అనంతకృష్ణ మహిళలో వచ్చే మూత్రనాళ సంబంధ సమస్యలపై ప్రసంగించారు. డాక్టర్ అనంత కృష్ణ ఇంగ్లాండ్‌లోని కెట్టెరింగ్ జనరల్ హాస్పిటల్ యూరాలజీ విభాగంలో సేవలు అందిస్తున్నారు. మూత్రనాళ సంబంధిత మహిళల్లో వచ్చే వ్యాధులు, కారణాలు, నివారణ, నియంత్రణ, తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.వి.లక్ష్మీనారాయణ, ఆచార్య ఎ.డి.పి.రావు, డాక్టర్ పి.వి.మధుసూదనరావు, డాక్టర్ ఎస్.అప్పన్నబాబు, డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎం.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ బేడా మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

ఇద్దరు బాలలకు ఆశ్రయం



బాలుడిని నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయికి అప్పగిస్తున్న రైల్వే పోలీసు

అల్లిపురం: రైలులో విశాఖ చేరుకుని దిక్కుతోచని స్థితిలో ఉన్న ఇద్దరు బాలలకు జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. ఏయూటీడీ టీఎస్ఆర్ నిరాశ్రయ వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన బాలిక ఇంటిలో గొడవ పడి నగరానికి రైలులో చేరుకుంది. రైల్వే పోలీసులు ఆమెను స్టేషన్‌లో గమనించి ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయ వసతి గృహానికి అప్పగించారు. అస్సాంకు చెందిన ప్రసాద్‌ను కూడా రైల్వే పోలీసులు గమనించి నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు.

కల్యాణం.. వైభోగమే..!

నగరంలోని ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం ఆధునిక హంగులతో ఆహ్వానం పలుకుతోంది. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన మండపం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కనువిందుగా దర్శనమిస్తోంది. తక్కువ ఖర్చుతో శుభ కార్యాల నిర్వహణకు సకల సదుపాయలు కల్పిస్తోంది. టీటీడీ యాజమాన్యం సమకూర్చిన రూ.2 కోట్ల నిధులతో మండపం ఆధునికీకరణ పనులను జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం పూర్తిచేసింది. ప్రస్తుతం కల్యాణ మండపం శుభకార్యాలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోంది.

- సకల వసతులతో టీటీడీ కల్యాణ మండపం సిద్ధం
- రూ.2 కోట్ల నిధులతో ఆధునికీకరణ
- అధునాతన హంగులు అద్దిన జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం
- సెంట్రల్ ఏసీతో పాటు సువిశాలమైన పార్కింగ్, డైనింగ్ సౌకర్యాలు



ఇది కదా అభివృద్ధి

ఎంవీపీ కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానానికి విశాఖలో పలు చోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇందులో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం ఒకటి. దశాబ్దాలుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికైన ఈ మండపం ఆధునికీకరణకు మాత్రం ఆమడ దూరంలో ఉండేది. గత ప్రభుత్వం ఆధునికీకరణకు ప్రతిపాదనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ సర్కారు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేసింది.

వసతులు సంపూర్ణం

కల్యాణ మండపం ఆధునికీకరణ కోసం టీటీడీ రూ.2 కోట్ల నిధులు కేటాయించింది. ఏబీఆర్ అండ్ ఎంఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ ఈ పనులను నిర్వహించింది. ఇందులో ప్రధానంగా సెంట్రల్ ఏసీ సిస్టం, జెట్‌నోజిల్స్, ఆకర్షణీయమైన సీలింగ్, యూపీవీసీ డోర్స్ సిస్టం, అధునాతన ఫ్లోరింగ్, విద్యుత్ దీపాల పనులు చేపట్టారు. మండపంపై శ్లాబ్‌ను లీక్‌ప్రూఫ్‌గా తీర్చిదిద్దుతున్నారు. కల్యాణ మండపం అవసరాలకు అనుగుణంగా 315 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. మండపంతో పాటు డైనింగ్ హాల్‌ని, కిచెన్‌ను కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. ముఖద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.



సువిశాలంగా మండపం లోపల ప్రధాన హాల్



ఆధునికీకరించిన ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం



అధునాతన ఫ్లోరింగ్

ఆన్‌లైన్‌లో బుకింగ్స్

ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం సేవలను శుభకార్యాలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చు. ఇందు కోసం టీటీడీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ముందస్తుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో రూ.50లు అద్దెగా, రూ.9 వేలు జీఎస్టీగా చెల్లించాలి. బుకింగ్ పూర్తయిన అనంతరం ఆ వివరాలతో కూడిన దరఖాస్తును టీటీడీ ఎంవీపీ కార్యాలయం అందజేయాల్సి. అనంతరం అక్కడ నిర్వహణ ఖర్చులుగా రూ.70 వేలు చెల్లించాల్సి ఉంటుంది. విద్యుత్, తాగునీరు, మెయింటినెన్స్, క్లీనింగ్, తదితర ఖర్చుల లావాదేవీల తరువాత రూ.70 వేలలో మిగతా డబ్బులను వినియోగదారుడికి తిరిగి ఇచ్చేస్తారు.

వెంకన్న ఆశీస్సులు లభిస్తాయి..



ఎంవీపీ కాలనీలోని కల్యాణ మండపంలో పెళ్లి, రిషప్షన్ చేసుకుంటే సాక్షాత్తు శ్రీవారి ఆశీస్సులు లభిస్తాయన్న నమ్మకం ఉంది. దశాబ్దాలుగా ఈ మండపం వేల శుభకార్యాలకు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వేదికగా నిలిచింది. టీటీడీ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మండపాన్ని అత్యంత అధునాతనంగా తీర్చిదిద్దింది. అన్ని సౌకర్యాలతో చాలా తక్కువ ఖర్చుతోనే ఈ మండపం సేవలను టీటీడీ అందుబాటులో ఉంచింది.

– సత్యకుమార్, ఆధ్యాత్మిక వేత్త

అద్భుతమైన వేదిక..



శుభకార్యాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం అద్భుతమైన వేదిక. నగర పరిధిలోని ఏ కల్యాణ మండపంలో ఇలాంటి సౌకర్యాలు అందుబాటులో లేవు. ఇలాంటి వేదిక ప్రైవేటుగా అయితే రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చెల్లించాల్సి ఉంటుంది. విశాలవంతమైన హాల్, ఓపెన్ ప్లేస్, పార్కింగ్, డైనింగ్ హాల్ ఇలా అన్ని సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయి. మండపం నిర్వహణ కూడా చాలా బాగుంది.

– ఎస్. వెంకటపతిరాజు, వినియోగదారుడు

తక్కువ ఖర్చుతో సకల వసతులు



కల్యాణ మండపంలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. సువిశాలమైన ప్రధాన మండపం వేదికతో పాటు డైనింగ్ హాల్, విశాలమైన పార్కింగ్ సదుపాయం ఉంది. తక్కువ ఖర్చుతోనే వీటిని వినియోగించుకోవచ్చు. మండపాన్ని బుక్ చేసుకున్న వారికి 4 గదులు కేటాయిస్తాం. ఇందులో రెండు ఏసీ గదులు ఉన్నాయి. తొలుత ఆన్‌లైన్‌లో తేదీని బుక్ చేసుకుని ఆ తేదీకి ఒక్కరోజు ముందు ఎంవీపీ కార్యాలయంలో సంప్రదిస్తే సరిపోతుంది. 2 వేల మంది సామర్థ్యంతో ఇక్కడ వేడుకలు జరుపుకోవచ్చు.

– బొడ్డేపల్లి హైమావతి, మేనేజర్, టీటీడీ కల్యాణ మండపం

మైనార్టీల అభ్యున్నతికి కృషి

ఎంవీపీ కాలనీ: లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ జిల్లా మైనార్టీ మోర్చా కార్యవర్గ సమావేశం జరిగింది. మోర్చా జిల్లా అధ్యక్షురాలు తిరుకోటి భారతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి చేస్తున్న కృషిని కొనియాడారు. అంతర్జాతీయంగా మోదీ నాయకత్వానికి మంచి ప్రశంసలు లభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్మోగిన శివనామ స్మరణ



సిద్ధి వినాయక పార్వతీ ముక్తీశ్వరాలయంలో జ్యోతిర్లింగాల వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞాన లింగేశ్వర ఆలయంలో రుద్రాభిషేకాన్ని ఆలయ ప్రధానార్చకులు అరవెల్లి సూర్యప్రకాశ్‌శర్మ, రామకృష్ణ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, భాస్కరశర్మ ఘనంగా నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ సేవా సంఘం సభ్యులు ఏర్పాట్లు చేశారు.

జోరు వానలో అన్నదానం

కొత్త వెంకోజీపాలెంలో శ్రీగౌరీ జ్ఞాన లింగేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్పస్వాముల అన్నదాన కార్యక్రమం సోమవారం జోరువానలో కూడా కొనసాగింది. స్వాములకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీలా రమణ, ప్రధాన కార్యదర్శి కాండ్రేంగుల నూకేశ్వరరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఎంవీపీ కాలనీ: స్థానిక శ్రీసిద్ధివినాయక పార్వతీ ముక్తీశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం 3వ సోమవారం కావడంతో ప్రత్యేక పూజల నిర్వహణ కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా భారీ ఎత్తున తరలివచ్చారు. శ్రీసిద్ధి వినాయక పార్వతీ ముక్తీశ్వరాలయంలో కొలువుదీరిన నీలకంఠుడికి పెద్ద ఎత్తున పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు దీపారాధన, క్షీరాభిషేకం, ఏకవారాభిషేకాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తుల మహాశివనామ స్మరణ మార్మోగింది. ఆలయంలోని తులసి కోట, ధ్వజ స్తంభంతో పాటు నందీశ్వరుడి వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

డెబ్రిస్‌తో నిండిపోతున్న ముడసర్లోవ రోడ్లు





ముడసర్లోవ రిజర్వాయరు వెనుక రోడ్డుపై వేసిన రాళ్ల దిబ్బలు, చెత్త కుప్పలు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనక రోడ్లు మళ్లీ డెబ్రిస్‌తో నిండిపోతున్నాయి. ఏడాది క్రితం వరకు నగరంలో పలు ప్రాంతాల నుంచి గృహ నిర్మాణ వ్యర్థాలను లారీలతో తీసుకొచ్చి ఈ రహదారుల్లో డంప్ చేస్తుండేవారు. ఈ ఏడాది మార్చిలో నగరంలో జరిగిన జీ–20 సందస్సుకు హాజరైన దేశ, విదేశీ ప్రతినిధులు ముడసర్లోవలో ఫ్లోటింగ్ సోలార్‌ను సందర్శించారు. దీంతో జీవీఎంసీ అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే ఆలోచనతో ఇక్కడ డెబ్రిస్‌తో నిండిపోయిన రోడ్లను శుభ్రం చేయించారు. లారీలు రిజర్వాయర్ వెనక రోడ్లలోకి ప్రవేశించకుండా ఐదు చోట్ల ఇనుప గేట్లు ఏర్పాటు చేశారు. అంత వరకు ఉన్న వ్యర్థాలను తొలగించడానికి అధికారులు రూ.లక్షల్లో ఖర్చు చేశారు. దీంతో డెబ్రిస్‌కు బ్రేక్ పడింది. ఇటీవల మళ్లీ ఇక్కడ వ్యవహారం మొదటికి వచ్చింది. లారీలతో వ్యర్థాలు తీసుకెళ్లేవారు కొన్నిచోట్ల ఇనుప గేట్లు ఒకవైపు తొలగించేసి యథేచ్ఛగా ఈ రోడ్లలోకి ప్రవేశిస్తున్నారు. లారీలతో తీసుకొచ్చిన వ్యర్థాలను రోడ్లపైనే డంప్ చేసి దర్జాగా వెళ్లిపోతున్నారు. ప్రస్తుతం ఇక్కడ రోడ్లు రాళ్లు, చెత్త, గృహ వ్యర్థాలతో నిండిపోయాయి. కొద్ది రోజుల్లో పలు ప్రభుత్వ కార్యాలయాలు ఈ ప్రాంతానికి తరలించే యోచనలో అధికారులు ఉన్నారు. ముడసర్లోవ వద్ద ఉన్న జీవీఎంసీ భవనంలో ఇంత వరకు అద్దెకు నిర్వహిస్తున్న హెచ్‌పీసీఎల్ స్కిల్ డెవలెప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌ను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఇక్కడ రోడ్లు వ్యర్థాలతో మూసుకుపోవడం గమనార్హం. దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారులు తక్షణ చర్యలు చేపట్టకపోతే పూర్తిగా రోడ్లు మూసుకుపోయే పరిస్థితి ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

జూలో సౌకర్యాల మెరుగు



జూ కొలను ఒడ్డున ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలపై సేదదీరుతున్న సందర్శకులు(ఫైల్)



ఆట పరికరాలు వద్ద ఆడుకుంటున్న చిన్నారులు(ఫైల్)

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఇటీవల సౌకర్యాలు మెరుగుపడ్డాయి. తాగునీరు, షెల్టర్లతో పాటు ఇటీవల విశాలమైన ప్రదేశాలలో చెట్ల కింద బెంచీలు, ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. జూలో వన్యప్రాణులు చూడడానికి వచ్చిన సందర్శకుల కోసం విశ్రాంతి తీసుకోవడానికి షెల్టర్లు నిర్మించారు. ఇప్పుడు జంతువులు, పక్షుల ఎన్‌క్లోజర్ల ముందు కొన్నిచోట్ల ఇనుము, సిమెంట్‌తో చేసిన బెంచీలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటిపై సందర్శకులు కూర్చుని సేదదీరుతున్నారు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో ఎక్కువ మంది కుటుంబ సభ్యులతో వచ్చి పిక్నిక్‌లు జరుపుకొంటున్నారు. సౌకర్యవంతంగా కూర్చుని భోజనాలు చేస్తున్నారు. ఏనుగులు, తెల్ల పులులు, ఎలుగుబంట్లు, నీటి ఏనుగులు, జూ సావనీర్ ఎదురుగా ఉండే కొలను ఒడ్డున, అడవి దున్నల ఎన్‌క్లోజరు ముందు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఆట పరికరాలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. జూ క్యాంటీన్ పక్కన, కనుజుల ఎన్‌క్లోజరు ఎదురుగా రెండు చోట్ల పిల్లల కోసం ఊయలలు, జారుడు బల్లలు, తూగుడు బల్లలు, రంగుల రాట్నాలు ఏర్పాటు చేశారు. వాటి వద్ద పిల్లలు సరదాగా గడుపుతున్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్లు



కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది



వర్షానికి కూలిన చెట్లు



చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు ప్రశాంతినగర్‌లో ఈదురుగాలులకు సోమవారం రెండు చెట్లు కూలిపోయాయి. మరికొన్ని ప్రాంతాలలో చెట్ల కొమ్మలు విరిగాయి. వీటిపై వెంటనే స్పందించిన కార్పొరేటర్ ముప్పల లక్ష్మి.. జీవీఎంసీ సిబ్బంది సహాయంతో తొలగించారు. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లపై మురుగునీరు పొంగి ప్రవహిస్తోంది. పలు ప్రాంతాలలో వర్షానికి ప్లాస్టిక్ బాటిళ్లు కొట్టుకువచ్చి కాలువలకు అడ్డంగా నిలిచిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. పారిశుధ్య సిబ్బంది బాటిళ్లను తొలగించే పనులు చేపట్టారు. పారిశుధ్య సిబ్బంది సైతం వర్షంలో తమ సేవలను కొనసాగించారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో పర్యావరణ పరిరక్షణ–ప్లాస్టిక్ నిషేధం అంశంపై గ్లోబల్ ఫౌండేషన్ నేతృత్వంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పైడా విద్యా సంస్థల అధినేత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. మహిళా సాధికారతతో పాటు జంతువుల పరిరక్షణ తమ బాధ్యతగా పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు, కాలుష్యం మరింత పెరుగుతున్నాయని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్కర్ష్ కో–ఆర్డినేటర్ టీనా రాజు, ప్రిన్సిపాల్ షైజీ, ఎం.శ్రీనాథ్, డాక్టర్ అరుణాదేవి, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, నళిని, హరిణి, సుధ, శారదా సిస్టర్ హేమ పాల్గొన్నారు.

స్పందనకు 8 అర్జీలు



అర్జీదారు నుంచి వినతి స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు 8 అర్జీలు వచ్చాయి. తహసీల్దార్ ఎం.ఆనందకుమార్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కుల, ఆదాయ, నివాస, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లపై అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.


తుపానుపై అప్రమత్తత

బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ తహసీల్దార్ ఆనందకుమార్ తెలిపారు. సోమవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ కొండవాలు, లోతట్టు ప్రాంతాలవాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటలూ తనతోపాటు డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాల వల్ల ఇబ్బందులుంటే 98499 03824 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని అన్ని ప్రాంతాలనూ అప్రమత్తం చేశామన్నారు.

మార్గశిర మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానం మార్గశిర మాసోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఆలయ ఈవో కె.శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం నేతృత్వంలో ఆశీల్‌మెట్ట సమీపాన అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాసుపల్లి మాట్లాడుతూ మార్గశిర మాసోత్సవాలు వైభవంగా నిర్వహించాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధర్మకర్తలు ధనలత, అనురాధ, సతీష్, మారుతీ ప్రసాద్, సురేష్, ప్రకాష్, సహాయ ఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

మునిగిన బోట్లు వెలికితీతకు వినతి



పోర్టు ట్రాఫిక్ మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

అల్లిపురం: ఫిషింగ్ హార్బర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదంలో మునిగిపోయిన బోట్లను త్వరితగతిన వెలికితీయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పోర్టు అథారిటీ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం పోర్టు ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దగ్ధమైన బోట్లు నీటిలో మునిగిపోవడంతో మిగతా మత్స్యకారులు తమ బోట్లు నిలపలేక ఇబ్బంది పడుతున్నారని, వేటకు వెళ్లి తెచ్చుకున్న చేపలను అన్‌లోడింగ్ చేసుకోలేక పోతున్నారని గురువులు వివరించారు. ఈ మేరకు స్పందించిన ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్ త్వరలోనే వాటిని బయటకు తీసే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారని కోలా గురువులు పేర్కొన్నారు.